మీకోసం ఇకపై స్ట్రీమ్ లైన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఇకపై స్ట్రీమ్ లైన్ చేయనున్నట్లు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న స్పష్టం చేశారు. నూజివీడులో సబ్ కలెక్టర్ వినూత్న సోమవారం మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశంతో అర్జీదారులకు టోకెన్ పంపిణీ చేయడంతో పాటు ప్రత్యేక ఫార్మేట్లో అర్జీదారుల సమస్యను పొందుపరచనున్నట్లు చెప్పారు. ఇందుకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీల సమర్పించే ప్రజలు వరుస క్రమంలో వచ్చే విధంగా టోకెన్స్ అందిస్తామన్నారు. అర్జీదారుల సమస్య ప్రత్యేక ఫార్మేట్లో నమోదు చేసి ఆన్లైన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి అర్జీ ఆన్లైన్ చేయడం ద్వారా నిర్ణీత వ్యవధిలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మొక్కజొన్న కంపెనీలు..మోసాలు..!

అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ అంటగడుతున్న కంపెనీలు
నాసిరకం సీడ్స్తో రైతులకు తీవ్ర నష్టాలు
ప్రతియేటా వందల సంఖ్యలో రైతుల పరిస్థితి అగమ్యగోచరం
జిల్లాలో దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు
గడిచిన డిఆర్సి సమావేశంలో ఇదే అంశంపై ఎంఎల్ఎల ప్రశ్నలు
మొక్కజొన్న సాగుకు మళ్లీ రైతుల సన్నద్ధం.. అధికారులు చర్యలు తీసుకునేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న రైతులను పలు సీడ్స్ కంపెనీలు నిలువునా ముంచేస్తున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు. ప్రతియేటా వందలాది మంది రైతులు కంపెనీలు ఇస్తున్న సీడ్స్తో తీవ్ర నష్టాలను మూటగట్టుకుని అప్పుల పాలవుతున్నారు. సీడ్స్ కంపెనీలు యథేచ్ఛగా రైతులను మోసగిస్తున్నా ప్రభుత్వంగాని, అధికారులుకుగాని పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మెట్ట ప్రాంతంలో అతిపెద్దసాగుగా మొక్కజొన్న ఉంది. దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగును రైతులు చేస్తున్నారు. ప్రతియేటా సెప్టెంబర్, అక్టోబర్ నెల్లో మొక్కజొన్న సాగు మొదలవుతోంది. జిల్లాలో మొక్కజొన్న సాగులో అత్యధిక కంపెనీలు ఇచ్చే సీడ్స్తోనే సాగు చేస్తున్నారు. కమర్షియల్ (వాణిజ్య) సాగు అతితక్కువగా సాగుతోంది. పలు సీడ్స్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు గ్రామాల్లోని రైతుల వద్దకు వెళ్లి తమ కంపెనీ సీడ్స్ పెద్దఎత్తున దిగుబడి వస్తుందని చెప్పి రైతులకు అంటగడుతున్నారు. కంపెనీలకు చెందిన ప్రతినిధుల మాటలు నమ్మి ఆయా కంపెనీల సీడ్స్ను రైతులు సాగు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చివరిలో దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. నాలుగైదు టన్నులు వస్తుందని నమ్మబలుకుతూ ఇచ్చిన సీడ్స్ సైతం టన్ను, టన్నున్నర మాత్రమే దిగుబడి వస్తున్నాయి. ఎకరాకు 30 వేలకుపైగా కౌలు, పెట్టుబడి ఎకరాకు రూ.50 వేల వరకూ రైతులు పెడుతున్నారు. రూ.80 వేలు ఖర్చు పెడితే రూ.40 వేల ఆదాయమూ రాని పరిస్థితి ఉంటుంది. వ్యవసాయాధికారులు అనుకూలమైన సీడ్స్ అప్పగిస్తున్న కంపెనీలు తర్వాత రైతులను పట్టించుకోవడం లేదు. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

అగ్రిమెంట్లు రాస్తేనే రైతులకు న్యాయం

మొక్కజొన్న సీడ్స్ అందిస్తున్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయాలి. సీడ్స్ వల్ల రైతులు నష్టపోతే ఆ నష్టాన్ని కంపెనీలు భర్తీ చేయాల్సి ఉంటుంది. సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాయకుండా రైతులకు సీడ్స్ అంటగడుతున్నాయి. దిగుబడి వస్తే తమ కంపెనీ గొప్ప అని చెప్పుకుంటున్నాయి. రైతులు నష్టపోతే మాత్రం పట్టించుకోవడం లేదు. నష్టపోయిన రైతులు కంపెనీ ప్రతినిధులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండాపోతోంది. దెందులూరు, పోలవరం, చింతలపూడి ఇతర నియోజకవర్గాల్లో ప్రతియేటా ఈ విధంగా వందలాది మంది రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాధికారుల వద్దకు వెళ్లినా ఎటువంటి ప్రయోజనమూ లేకుండాపోతోంది. సీడ్స్ కంపెనీలను వ్యవసాయ శాఖాధికారులు ఏమాత్రం అదుపుచేయని పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన డిఆర్సి సమావేశంలో ఇదే విషయంపై ఎంఎల్ఎలంతా ముక్తకంఠంతో ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో 50 మందికిపైగా మొక్కజొన్న సీడ్స్ కంపెనీల బాధితులు ఉన్నట్లు పోలవరం ఎంఎల్ఎ చెప్పడం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. నిబంధనల ప్రకారం అగ్రిమెంట్లు ఎందుకు రాయించడం లేదని వ్యవసాయాధికారులను ప్రజాప్రతినిధులంతా నిలదీశారు. ఈ ఏడాది సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాసి సీడ్స్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తగు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖాధికారులు చెప్పారు. అగ్రిమెంట్లపై ఇప్పటి నుంచే వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. అలాకాకుండా ప్రతియేటా మాదిరిగానే వ్యవసాయశాఖ వ్యవహరిస్తే రైతులు నష్టపోవడం ఖాయంగా ఉంది. ఈసారైనా సీడ్స్ కంపెనీలు అగ్రిమెంట్లు రాసేవిధంగా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటారో, లేదో చూడాల్సి ఉంది. అంతేకాకుండా కమర్షియల్ సాగులో మొక్కజొన్న పంటను కొనుగోలు చేస్తున్న కొంతమంది వ్యాపారులు రైతులకు సొమ్ము ఇవ్వకుండా ఎగనామం పెడుతున్నారు. ఇలాంటి మోసాలపైనా అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

వెరిఫికేషన్ పేరుతో వేధించొద్దు

కలెక్టరేట్ వద్ద వికలాంగుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నో సంవత్సరాలుగా వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్న తమను ఇప్పుడు వెరిఫికేషన్ పేరుతో వేధించడం సరికాదని, వైకల్య శాతం తగ్గించి ప్రభుత్వ పథకాలకు తమను దూరం చేయకుండా తమకు న్యాయం చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షులు మామిడిపల్లి నాగభూషణం మాట్లాడుతూ పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్న తమను గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్నామని, ఇప్పుడు రీవెరిఫికేషన్ పేరుతో వైకల్య శాతం తగ్గించి తమను ప్రభుత్వ పథకాలకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం ఉన్న వైకల్యాన్ని 40 శాతానికి, 60 శాతానికి తగ్గించి తమకు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలుగాని, ప్రభుత్వ పథకాలుగాని అందకుండా చేయడం సరికాదన్నారు. గతంలో ఉన్న సర్టిఫికెట్లనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వికలాంగుల పెన్షన్ రూ.70 ఉన్నప్పటి నుంచి తామంతా పెన్షన్ పొందుతున్నామని, ఇప్పుడు రీవెరిఫికేషన్ అంటూ ఏ పనీ చేయలేని తమను ఆవేదనకు గురి చేయవద్దని కోరారు. కార్యదర్శి బుర్ర సుధాకరమ్మ, కోశాధికారి నక్క రాము, మహిళా అధ్యక్షురాలు పట్టా మేరీ తదితరులు పాల్గొన్నారు.

వైకల్య శాతం కుదించారు

బొర్రా సుధాకరమ్మ, వేంపాడు, ఏదపాడు మండలం

25 సంవత్సరాల నుంచి అంటే రూ.70 పెన్షన్ ఉన్నప్పటి నుంచి పెన్షన్ పొందుతున్నాను. గత సంవత్సరం నుంచి పూర్తి వైకల్యం కారణంగా రూ.15 వేలు పెన్షన్ పొందుతున్నాను. కానీ ఇప్పుడు 90 శాతం నుంచి 60 శాతానికి వైకల్యం సర్టిఫికెట్ ఇచ్చి రూ.ఆరు వేలకు తగ్గించారు. పూర్తి వైకల్యం ఉన్న నేను ఏ పనీ చేసుకోలేను. నాకు న్యాయం చేయాలి.

వికలాంగుల జాబితాలోనే నా పేరు తీసేశారు

రేలంగి రామాంజనేయులు, బాదంపూడి, ఉంగుటూరు మండలం

23 సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్నాను. అయితే ఇప్పుడు అసలు లిస్టులో నా పేరు లేదని అంటున్నారు. పూర్తి వైకల్యం కారణంగా అధికారుల చుట్టూ తిరగలేని పరిస్థితి. కాబట్టి నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

పాత సర్టిఫికెట్నే కొనసాగించాలి

ఎం.సుజాత, ఉప్పరగూడెం, భీమడోలు మండలం

పది సంవత్సరాల నుంచి పెన్షన్ తీసుకుంటున్నాను. రీ వెరిఫికేషన్ పేరుతో ఇప్పుడు వైకల్యాన్ని 90 శాతం నుంచి 65 శాతానికి తగ్గించారు. దానివల్ల మాకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చే అవకాశం లేదు. అలాగే బ్యాటరీ వాహనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. గతంలో ఇచ్చిన సర్టిఫికెట్నే కొనసాగించి నాకు న్యాయం చేయాలి.

భూ సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా
ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో నినదిస్తున్న నేతలు, పేదలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని అన్ని రకాల భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో జిల్లాలో భూసమస్యలు ఎదుర్కొంటున్న గిరిజనులు, దళితులు, పేదలు పెద్దసంఖ్యలో హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముఖ్యవక్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలోని ఉన్న అన్ని భూసమస్యలను పరిష్కరించాలని, 1/70 చట్టం అమలు చేయాలని, ఎల్టిఆర్, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులను అమలు చేయాలని, జిల్లాలో రకరకాల ప్రభుత్వ భూములను, అన్యాక్రాంతమైనవాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అర్హులైన గిరిజనులు, దళితులు, పేదలకు ఇవ్వాలని కోరారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, కొల్లేరులో జిరాయితీ భూములు పేదలకు పంచాలని, ప్రభుత్వ భూములను కొల్లేరు ప్రజలకు పంచాలని కోరారు. పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటికే అన్యాక్రాంతమైన ఎల్టిఆర్ భూములు 55 వేల ఎకరాలు ఉన్నాయని వైఎస్.రాజశేఖర్రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మంత్రి రెడ్యానాయక్ అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు. ఆ భూములను స్వాధీనం చేసుకుని ఆ ప్రాంతంలోని గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూమి కొనుగోలు పేరుతో గిరిజనులు సాగు చేసుకుంటున్న ఎల్టిఆర్ భూములనే గిరిజనేతరుల పేరుతో తప్పుడు రికార్డులు సృష్టించి చట్ట విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారన్నారు. స్థానిక గిరిజనులకు, నిర్వాసిత గిరిజనులకు మధ్య తగవులు పెడుతున్నారని తెలిపారు. పి-4తో పేదరికం పోదని, భూమి లేని పేదలకు కనీసం ఎకరం లేదా రెండెకరాల భూమి పంచడం వల్ల మాత్రమే పేదరికాన్ని నిర్మూలించవచ్చని అన్నారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములు, దెందులూరు, దోసపాడు, కొవ్వలి, నూజివీడు ప్రాంతంలో ఆగిరిపల్లి, చింతలపూడి, కైకలూరు ప్రాంతంలో మండవల్లి, సింగన్నపూడి చోట్ల రకరకాల ప్రభుత్వ భూములు దాదాపు మూడు లక్షల ఎకరాలకుపైగా ఉన్నాయన్నారు. ఈ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఆ ప్రాంతంలో ఉన్న అర్హులైన గిరిజనులు, దళితులు, పేదలకు పంచాలని, జిల్లాలో ఉన్న భూ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్ఒ విశ్వేశ్వరరావు ధర్నా శిబిరం వద్దకు చేరుకోగా నాయకులు సమస్యలను వివరించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన గిరిజనులు, దళితులు, పేదలు తాము తెచ్చిన వినతి పత్రాలను డిఆర్ఒ విశ్వేశ్వరరావుకు అందజేశారు. ఈ వినతిపత్రాలను కలెక్టర్కు అందిస్తామని, ప్రభుత్వం తరపున సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని డిఆర్ఒ తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, డిఎన్విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పిల్లి రామకృష్ణ, కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, కారం భాస్కర్, పి.మంగరాజు, తామా ముత్యాలమ్మ తదితరులు నాయకత్వం వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

గ్రీన్ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు, రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రీన్ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రోడ్లు నిర్మించాలని, పరిహారం పెంచి ఇవ్వాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద గ్రీన్ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పిజిఆర్ఎస్లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాల ప్రకారం అధికారుల బృందం పర్యటించి రైతుల సమస్యలపై నివేదిక ఎందుకు ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారంలోగా గ్రీన్ఫీల్డ్ హైవే ప్రాంతాల్లో అధికారులు పర్యటించేలా షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. ఈ ధర్నానుద్దేశించి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను హైవే అథారిటీ అధికారులు, భూసేకరణ అధికారులు తుంగలో తొక్కడం దారుణమని విమర్శించారు. గ్రీన్ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, పంటలు తెచ్చుకునే అవకాశం లేక నానా తంటాలు పడుతున్నారన్నారు. గ్రీన్ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రోడ్లను తారు రోడ్లుగా నిర్మించాలని కోరారు. భూసేకరణలో అతి తక్కువ పరిహారం ఇవ్వడం వల్ల రైతులు నష్టపోయారని, ఆర్బిట్రేషన్ల ద్వారా తగు న్యాయం చేయాలన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని, గ్రీన్ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల నష్టపోతున్న రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 2న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం వద్ద గ్రీన్ఫీల్డ్ హైవే దిగ్బంధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం జరుగుతుందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి, కె.పిచ్చిరెడ్డి, జి.లక్ష్మీరెడ్డి, ఇర్ల శ్రీనివాసరెడ్డి, డి.సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై కేంద్రీకరించాలి

రీ ఓపెన్కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలి
పిజిఆర్ఎస్లో వచ్చిన అర్జీలు 441
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని, క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. కలెక్టరేట్లో గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. కలెక్టర్తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్డిఒ ఎం.అచ్యుత అంబరీష్, ఎస్డిసి కె.భాస్కర్, జెడ్పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ అర్జీలు స్వీకరించారు. శాఖలవారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించి క్షేత్రస్థాయిలో ఉత్పన్నమయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే చక్కని పరిష్కార మార్గాలు చూపి, అర్జీలు రీఓపెన్కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. మండవల్లి మండలం అల్లినగరానికి చెందిన జుజ్జవరపు పాల్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నానని, కొన్ని నెలలుగా జీతం రావడం లేదని, పరిష్కారం చూపాలని కోరారు.

యూరియా కొరత తీర్చాలని ఎంఎల్ఎ చింతమనేని వినతి

తన నియోజకవర్గంలో యూరియా కొరత ఉందని, ప్రతి సొసైటీకి అవసరమైన యూరియా స్టాకు పంపాలని కోరుతూ దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి పిజిఆర్ఎస్లో వినతి అందజేశారు. రైతుల అవసరానికి తగ్గట్టుగా యూరియా సరఫరా చేయాలన్నారు. రైతులకు ఎరువులు అందించడంలో కోఆపరేటివ్ సొసైటీలో ఆధారు కార్డు చూపించమని ఒటిపి కారణాలతో జాప్యం జరుగుతుందని, సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో సదరం స్పెషల్ క్యాంపులను ఏర్పాటు చేసి మిగిలి ఉన్న వికలాంగుకలు సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేసి, పెన్షన్ల మంజూరుకు అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు.

28న డిఎస్సి అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డిఎస్సి-2025కు సంబంధించి వివిధ కేటగిరి పోస్టులకు గల అభ్యర్థుల లాగిన్లో సోమవారం రాత్రికి సమాచారం వచ్చిన అభ్యర్థులు సదరు సమాచార కాపీని డౌన్లోడ్ చేసుకుని ఈ నెల 28న సర్టిఫికెట్ వెరిఫికేషన్కు హాజరుకావాలని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక వట్లూరులోని సర్ సిఆర్రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 28వ తేదీ ఉదయం 9 గంటలకు వెరిఫికేషన్కు హాజరు కావాలని కోరారు. సదరు అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు మూడు జిరాక్స్ సెట్లు గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించి తీసుకురావాలని పేర్కొన్నారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ మార్కుల కాపీ, డిఎస్సి హాల్ టికెట్ కాపీ, ఆధార్ కార్డ్, ఐదు పాస్పోర్టు సైజ్ ఫోటోలతో రావాలని తెలిపారు. వెరిఫికేషన్కు హాజరయ్యే ముందు అభ్యర్థి తమ సర్టిఫికెట్లను https://apdsc.apcfss.in సైటులో వ్యక్తిగత లాగిన్లో అన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 903073444, 905239111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో

నాలుగు రోజుల్లో పరిష్కరిస్తామన్న అధికారుల హామీలేమిటీ
డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డిఎస్సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులు ముందుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోరుతూ పిజిఆర్ఎస్లో కలెక్టర్ వెట్రిసెల్వికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ జూన్, జులైలో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ సందర్భంగా జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, కుక్కునూరు మండలంలో మొత్తం 46 పాఠశాలలు ఉండగా, మండలానికి కేటాయించిన పోస్టులు 141 అయినా ప్రస్తుతం మండలంలో ఉపాధ్యాయులు 46 మందే ఉన్నారన్నారు. ఇంకా 95 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వేలేరుపాడు మండలంలో మొత్తం 43 పాఠశాలలు ఉన్నాయని, మండలానికి కేటాయించిన పోస్టులు 95గానీ, ప్రస్తుతం మండలంలో ఉన్న ఉపాధ్యాయులు 43 మంది ఉన్నారన్నారు. ఇంకా 44 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, తద్వారా షెడ్యూల్ ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు విద్య అందించడంలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన పిల్లలు విద్యకు దూరమవుతున్నారన్నారు. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ సందర్భంగా ఈ పరిస్థితిని అధికారులు ముందుగా అంచనా వేయకపోవడం బాధాకరమన్నారు. కుక్కునూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎంఇఒ బాబూరావు ఇంత జరుగుతున్నా మండలంలో ఉన్న స్కూల్స్ను సందర్శించడంగాని, సమస్యకు పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని సూర్యకిరణ్ డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు రాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నూజివీడు ఆటో వర్కర్స్ యూనియన్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్కు సంవత్సరానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, వారి కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 21 రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. బ్రిటిష్ చట్టాల కంటే కఠినంగా తయారుచేసిన బిఎన్ఎస్ 106 (1) (2) చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ఆర్ హనుమాన్లు, నూజివీడు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, ఇతర విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మనోజ్, కె.లెనిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్, లెనిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అమలు చేయలేని పక్షంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. ముఖ్యంగా జిఒ 77ను వెంటనే రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలు రూ.మూడు వేలకు పెంచి మెరుగైన వసతులు అందించాలని కోరారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఎన్నో పోరాటాలు, ఆందోళనలు చేశామని, ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని, ప్రభుత్వం వెంటనే తమ మొండి వైఖరిని వీడి విద్యారంగ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలన్నిటినీ పరిష్కరించే దిశగా పనిచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏలూరులో ఎస్సి బాలుర కాలేజీ హాస్టల్ విద్యార్థులను మద్యం తాగమంటూ హాస్టల్ వెల్ఫేర్ అధికారి ప్రోత్సహిస్తున్నారని, వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు కేటాయించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, నూజివీడు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఏలూరు నర్సింగ్ కళాశాలకు సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సొంత భవనాలు నిర్మించాలని, అమీనాపేట బాలికల వసతి గృహంలో మురికి నీరు బయటకు వెళ్లకుండా ఉండటం వల్ల దోమలు ఎక్కువైపోయి విద్యార్థులకు విష జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉన్న నేపథ్యంలో వెంటనే డ్రెయినేజీ శుభ్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.పవన్, నగర ఉపాధ్యక్షులు ఎం.జయంత్, ఎం.శివ, ఎస్.రాజబాబు, ఎస్.సూర్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ.శ్యామలారాణి

మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేద మహిళలను వేధింపులకు గురిచేస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి డిమాండ్ చేశారు. స్థానిక పుణ్యమూర్తులు వారి వీధిలో ఉన్న అన్నే అనసూయమ్మ భవనంలో ఐద్వా ఏలూరు నగర మహాసభ పి.హైమావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ నగర మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించి మహిళా సంఘం అభివృద్ధికి, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్యామలారాణి మాట్లాడుతూ తగిన ఉపాధి లేక ఆర్థిక అవసరాలు కోసం మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారన్నారు. అధిక వడ్డీలు చెల్లించలేక మైక్రో కంపెని వేధింపులు, అవమానాలకు గురవుతూ మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, పోలీసులు జోక్యం చేసుకోవాలని, లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.అరుణకుమారి, జె.హరీషా దుర్గ, రజని, షమీమా, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి పింఛన్లు

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా జరుగుతున్న అర్హులైన పింఛన్ దారుల జాబితా రీవైద్య పరీక్షల్లో కొంతమంది పింఛన్లు కోల్పోవడంపై ఆందోళన చెందడంతో మంత్రి నూజివీడు నియోజకవర్గ మండల అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పింఛన్ల తొలగింపు, పునరుద్ధరణపై అధికారులంతా పారదర్శకంగా పని చేయాలన్నారు. ఒక్కొక్క మండల అధికారితో సమీక్షించారు. వైద్యపరీక్షలు, వైద్య పత్రాల మంజూరులో ఎటువంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా పని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ, పింఛన్లు అందేలా ప్రభుత్వ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పింఛన్లు అందించడంలో ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కోల్పోకుండా అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెల ఒకటో తేదీ నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ, పింఛన్లు అందేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి, ముసునూరు, నూజివీడు రూరల్, ఆగిరిపల్లి, మండలాభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అర్జీలను తీసుకుని సంబంధిత అధికారులను ఆదేశించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్న మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సమస్యలపై సంబంధిత ప్రభుత్వ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


నూజివీడు టౌన్ : మాట్లాడుతున్న నాగశైలజ

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు తల్లి బిడ్డ మరణాలు సంభవిస్తున్నాయని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై నాగిరెడ్డిగూడెం జెడ్‌పి హైస్కూల్‌లో సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ టి.సత్యవతి, సిఐ టి.క్రాంతికుమార్, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ కిరణ్‌బాబు, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, స్కూల్ ప్రిన్సిపల్ హేమలత, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే బాల్య వివాహ నిరోధక అధికారులకు తెలియజేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.మరియమ్మ సూచించారు. మండలంలోని ప్రగడవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలోని యానాదుల కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో, ప్రైమరీ స్కూల్లో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ జిల్లా అదనపు జడ్జి నాగశైలజ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. పోక్సో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఒ విజయ్‌కుమారి మాట్లాడారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, న్యాయవాది పద్మావతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిపోర్టు ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రమణక్కపేటలో ఎరువుల షాపులను విజిలెన్స్ ఎఒ జి.మీరయ్య, ఎస్ఐ రంజిత్‌కుమార్ మండల ఎఒ అక్కినేని ఛాముండేశ్వరితో కలిసి తనిఖీ చేశారు. నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు.

నేరాలు - ఘోరాలు

యూరియా అక్రమ తరలింపు : వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

యూరియా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి యూరియా స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె.హబీబ్‌భాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండివారిగూడెం గ్రామంలో సోమవారం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా యూరియా తరలిస్తున్నారనే సమాచారంతో వ్యవసాయ శాఖ సిబ్బందితో దాడులు నిర్వహించి 50 బస్తాలు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ దాడుల్లో మండల వ్యవసాయ శాఖ అధికారిణి ప్రియాంక, విఎఎ పిఎన్‌వి.మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిలకడగా హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం

నేడు డిశ్చార్జ్ : ఆసుపత్రి సూపరింటెండెంట్ కమల

వసతిగృహాన్ని పరిశీలించిన ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అస్వస్థతకు గురైన జంగారెడ్డిగూడెం గిరిజన సంక్షేమ శాఖ కళాశాల వసతిగృహం విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని, వారికి వైరల్ ఫీవర్ తప్ప టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాలు లేవని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల తెలిపారు. వసతి గృహంలో ఆదివారం ఉదయం 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వగా వారిని వార్డెన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్త పరీక్షలు చేయగా వైరల్ ఫీవర్ ఉన్నట్లు తెలిపారు. వసతిగృహంలో ఉన్న మిగతా విద్యార్థులందరూ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఎవరికి విషజ్వరాలు లేకపోవడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వసతిగృహంలో ఒకేసారి అంతమంది అస్వస్థతకు గురవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య

మంగళవారం అందరిని డిశ్చార్జ్ చేస్తాం
ఆసుపత్రి సూపరింటెండెంట్

12 మంది విద్యార్థుల ఆరోగ్యం నిలకడగానే ఉందని, మంగళవారం ఉదయం అందరినీ డిశ్చార్జ్ చేస్తామని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల తెలిపారు. ఎవరూ అపోహలు పడొద్దన్నారు. వీరి ఆరోగ్యంపై డిఎంహెచ్‌ఒకు వివరణ ఇచ్చామని తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వసతి గృహంలో ఎటిడబ్ల్యుఒ పరిశీలన

వసతిగృహాన్ని ఎటిడబ్ల్యుఒ శ్రీవిద్య పరిశీలించారు. వసతిగృహంలో ఉంటున్న అందరి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆహారం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థుల ఆరోగ్యం పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

పిజిఆర్ఎస్‌లో 27 అర్జీలు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిజిఆర్ఎస్ ద్వారా పలు అర్జీలు వచ్చినట్లు ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ జె.పురుషోత్తంశర్మ తెలిపారు. పింఛన్లు ఆగిపోయయని, మళ్లీ ఇప్పించాలని కోరుతూ 27 మంది అర్జీలు చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో సూరేపల్లి గ్రామానికి చెందిన ఇరువురు రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయని, కాని ఆన్‌లైన్‌లో నమోదు ఉండటం లేదని అర్జీలు అందించారు.

చర్చి నిర్మాణానికి మంత్రి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గుడిపాడు ఎస్‌సి కాలనీలో చర్చి నిర్మాణం సగం పూర్తి కాకుండానే మిగిలిపోయింది. ఈ విషయాన్ని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి రూ.20 వేల నగదు అందించారు. గతంలో సిమెంటు బస్తాలు, ఇసుక ఖర్చులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, కొల్లి గంగారం, మెదరమెట్ల సురేంద్ర, కొల్లి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి రమణక్కపేట వాసుల సమస్యలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేటలో సమస్యలను గ్రామస్తులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రిని వారు విజయవాడలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో విద్యుత్, ఓవర్ లోడ్, వీధి లైట్లు, రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. టిడిపి గ్రామ అధ్యక్షులు రంగు శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ నాయకులు పాశం నాగబాబు, ఉలాస బాబి, రాంబాబు, పటాపంచల శివ పాల్గొనారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని కోడూరులో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ సోమవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. నరేగా నిధులతో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు, పంచాయతీ మంచినీటి చెరువుకు నూతన ఫెన్సింగ్, సచివాలయ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పెనుమల్లికి చెందిన లుక్కా అరుణకుమారికి సిఎం సహాయ నిధి నుంచి హాస్పిటల్ బిల్స్ నిమిత్తం మంజూరైనా రూ.1.92 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మి, బొర్రా చలమయ్య, అడుసుమిల్లి వెంకట్రావు, వల్లభనేని శివాజీ, వీరంకి వెంకయ్య, పరసా ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్రీవారికి రూ.3.61 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీలు సోమవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. ఈ హుండీల లెక్కింపు ద్వారా స్వామి వారికి గడిచిన 38 రోజులకు రూ.3,61,54,678 ఆదాయం వచ్చింది. అలాగే యాత్రికుల కానుకల రూపేణ 261 గ్రాముల బంగారం, 6 కేజీల 834 గ్రాముల వెండి, పాత రూ.500 నోట్లు 24, రూ.వెయ్యి నోటు ఒకటి, రూ.రెండు వేల నోట్లు 27, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు, అర్చకులు, కేశఖండనశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి 106 గ్రాముల బంగారు ఆభరణం బహూకరణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి భీమవరానికి చెందిన పిన్నమరాజు శ్రీనివాసరాజు, విజయ వర్మ, శివరామరాజు, భూపతి రాజులు 106 బంగారు ఆభరణం బహూకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తికి ఆలయ కార్యాలయంలో అప్పగించారు. ఆలయ అధికారులు దాతకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, ఆభరణం అందుకున్నట్లు రసీదులు అందించారు.

'బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కడం అభినందనీయం'

ఏలూరు సిటీ :సినీ హీరో నందమూరి బాలకృష్ణకు లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ గోల్డ్ ఎడిషన్‌లో చోటు దక్కడం అభినందనీయమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎపిఎస్ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవం పొందిన తొలి నటుడిగా బాలకృష్ణ నిలవటం తెలుగు వారందరికీ గర్వకారణమని తెలిపారు. తన తండ్రి ఎన్‌టిఆర్ పేరు ప్రతిష్టలను నిలబెడుతూ సినీ రంగంతో పాటు రాజకీయ, సేవా రంగాల్లో కూడా ఎదురులేకుండా దూసుకుపోతున్న బాలకృష్ణను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

బకాయిల కోసం ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని గవరవరం గ్రామపంచాయతీలో ఉపాధి హామీ కూలీల పది వారాల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎపిఒ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ నాలుగు నుంచి ఐదు వారాల పాటు పని చేసిన కూలీలకు ప్రస్తుతం పనుల్లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, గత బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను రైతులతో అనుసంధానం చేసే ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. గతంలో ఉపాధి హామీ చట్టాలను సక్రమంగా అమలు చేస్తూ, కూలీలకు ప్లే స్లిప్పులు, పనిముట్లు, ఆటో ఛార్జీలు, మంచినీరు, గెడ్డపారలు, పలుగులు, టెంట్లు, మేట్లకు మూడు రూపాయలు, కొలత టేపులు, బుక్స్, పెన్నులు వంటి సౌకర్యాలు కల్పించేవారని,


వినతి అందిస్తున్న ఉపాధి కూలీలు

కాని ఇప్పుడు ఈ చట్టాల అమలు సరిగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జి.మురళి, కె.కుమార్‌లకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.మల్లిక, ఎం.ముత్యాలు, కె.సుధ, ఎస్.రాజేశ్వరి, ఎ.జ్యోతి, కె.వెంకన్న, బి.సూర్యచంద్రం, కాకరపర్తి రామకృష్ణ, కూడిపూడి గవరయ్య, కోడి నాగేశ్వరరావు, బల్లే సుబ్బారావు, రాఘవ రాజు, వెంకన్న, ఎ.దుర్గారావు, కె.సీతారాములు, సిహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడాలి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ సిబ్బందికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సూచించారు. మండలంలోని సబ్ స్టేషన్‌ను ఆయన సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎప్పుడూ రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలి చెప్పారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డిఎస్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కరెంటు కోతలు లేకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

చింతలపూడి, మారుతీ నగర్‌లో ఆటో షోరూంను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుంచి ఎన్ఆర్ఐలో ఆటోమోషన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్ఆర్ఐ సిబ్బంది

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో ఆధునాతన ఇఎల్ఎస్ఐ డిజైన్ సాంకేతికతలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆటోమేషన్ పరిజ్ఞానాన్ని విద్యావేత్తలకు అందించడంలో భాగంగా సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు అడ్వాన్స్‌డ్ విఎల్ఎస్ఐ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ సెమీ కండక్టర్ మాన్యూఫ్యాక్చరింగ్ ఎఐ ఆధారిత ఆటోమోషన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్‌ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కరరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎన్‌వి.సురేంద్రబాబు, డీన్ ఇసిఇ అండ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, డాక్టర్ వై.అర్పిత పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌గా సురేష్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి

ల్యాబ్ టెక్నీషియన్‌గా బుద్ధుల సురేష్ వృత్తికే వన్నె తెచ్చాడని ఆశావర్కర్లు స్పష్టం చేశారు. మండవల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ ఇటీవల విజయవాడ చిట్టినగర్‌లోని మలేరియా డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లిన ముద్దుల సురేష్‌ను స్థానిక పిహెచ్‌సిలో ఆశావర్కర్లు ప్రత్యేకించి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ గా

సురేష్‌ను సత్కరిస్తున్న ఆశావర్కర్లు

సురేష్ వైద్యులకు నిత్యం అందుబాటులో ఉండేవాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ లీడర్ శివపార్వతి, లక్ష్మి, వేగం అనూష, వెంకటలక్ష్మి, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్‌లను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు సేద్యంలో సహకారం అందించడానికి రాయితీపై ఇస్తున్న కిసాన్ డోన్ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామంలోని శ్రీ జనార్ధన స్వామి జెఎల్‌జి గ్రూపునకు ప్రభుత్వ రాయితీపై పొందిన కిసాన్ డ్రోన్‌ను రైతులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిసాన్ డ్రోన్ యంత్రాలను 80 శాతం రాయితీపై అందిస్తున్నారని, వీటిని రైతాంగం గ్రూపులుగా ఏర్పడి పొందవచ్చని చెప్పారు. ఎడిఎ జి.వెంకటమణి మాట్లాడుతూ డ్రోన్‌తో నానో రూపంలో ఉన్న ఎరువులను కూడా పిచికారీ చేసుకోవచ్చని, నానో ఎరువులు వాడి పర్యావరణాన్ని సంరక్షించుకుని నేల కాలుష్యాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ బస్తా యూరియాలో ఉండే పోషకాలు కేవలం అర లీటరు నానో యూరియాలో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అడుసిమిల్లి లక్ష్మి, వి.శివాజీ పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని వై-జంక్షన్ రింగ్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సేవ నాగ జగన్ బాబూరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఏలూరులో నిర్వహించిన పిజిఆర్ఎస్ వినతిపత్రం అందించారు. ముదినేపల్లి గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న వై-జంక్షన్ రింగ్‌లో అంబేద్కర్ విగ్రహం పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ గతంలో తహశీల్దార్ ముదినేపల్లి గ్రామ పంచాయతీ, ఆర్‌అండ్‌బి అధికారులకు అర్జీ పెట్టుకున్నట్లు చెప్పారు. అప్పట్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందు వల్ల ఆపాం న్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు చివరి దశకు వచ్చాయని, వై-జంక్షన్ రింగ్‌లో అంబేద్కర్ నిలువెత్తు విగ్రహం పెట్టుకునేందుకు ఆ స్థలాన్ని కేటాయించాలని కోరారు.

పెండింగ్ జీతాల చెల్లింపునకు కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులో పని చేస్తున్న సిబ్బందికి రావాల్సిన పెండింగ్ జీతాలను త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్ష హోదాలో ఉండగా శ్రీ సత్య సాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ సిబ్బంది సమస్యల కోసం పోరాడి వారి సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కొన్ని నెలలుగా జీతాలు చెల్లించలేదని రెండు రోజులుగా సమ్మె చేస్తున్న సిబ్బందితో చర్చలు జరిపామని, త్వరలోనే కూటమి ప్రభుత్వం వారి జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతులు ఇవ్వాలి

ప్రజాశక్తి - మండవల్లి

వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలు, సౌండ్ సిస్టం, లైటింగ్ ఏర్పాటు చేసుకునేలా అనుమతి ఇచ్చి డీజేపై ఆధారపడి జీవించే వారి కుటుంబాలను ఆదుకోవాలని కైకలూరు నియోజకవర్గ సౌండ్ లైటింగ్ షామియానా డెకరేషన్ వర్కర్స్, ఓనర్స్ యూనియన్ మండవల్లి ప్రెసిడెంట్ శాంతరాజు కోరారు. మండవల్లి మండలానికి చెందిన సౌండ్ సిస్టం లైటింగ్ సభ్యులతో కలిసి స్థానిక స్టేషన్‌లో పోలీసులను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అనుమతులకు లోబడి డీజేలు నిర్వహించుకునేల సహకరించాలని పోలీసులను కోరారు. ఎఎస్ఐ రాజు, హెడ్ కానిస్టేబుల్ స్వామి మాట్లాడుతూ పోలీసు అధికారుల అనుమతులతోనే నిబంధనలు మేరకే డీజేలను నిర్వహించుకోవాలని తెలిపారు. అనంతరం పోలీసులను యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన యువకుడిని పోలీసులు రక్షించారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... కొయ్యలగూడెం గ్రామానికి చెందిన త్రినతి అయ్యప్ప ప్రస్తుతం అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన అతను ఆత్మహత్య చేసుకునేందుకు బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పైకి ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలవరం డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ బాబు, కొయ్యలగూడెం ఎస్ఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆత్మహత్యకు యత్నిస్తున్న యువకుడిని ఓర్పుతో సముదాయించి, సురక్షితంగా కిందకు దింపారు. అనంతరం అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల అప్రమత్తతను, సేవా భావాన్ని స్థానికులు ప్రశంసించారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S.250/24

Between:
Dontagani Srinivasa Rao
... Plaintiff
And
Garikapati Divya, W/o.Naga Subramanyam, C/o.Garikapati Pothuraju, R/o.D.No.5-13, Puttlacharuvu Post, Mandavalli (Md), Eluru Dist., Pin: 521345.

ఈ నెంబరు దావాలో సదరు 8వ ప్రతివాదికి Court ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిన అందుకొనక పోవుటచే పై Court వారు Paper Publication Order Pass చేసియున్నారు. సదరు 8వ ప్రతివాది ది.16-9-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై Court వారి ఎదుట హాజరై ఆక్షేపణలువున్న యడల తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షంన దావా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 16-9-2025

డా॥ డి.వి.రమణారెడ్డి
పి.శ్రీనివాసరావు
అడ్వకేట్స్, విజయవాడ.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.1485/24
O.S.250/24

Between:
Dontagani Srinivasa Rao
... Petitioner/Plaintiff
And
Garikapati Divya, W/o.Naga Subramanyam, C/o.Garikapati Pothuraju, R/o.D.No.5-13, Puttlacharuvu Post, Mandavalli (Md), Eluru Dist., Pin: 521345.
...Respondet No.8

ఈ నెంబరు Petition లో సదరు 8వ Respondent Court ద్వారా ఎన్నిసార్లు Notice లు పంపించిన అందుకొనక పోవుటచే పై Court వారు Paper Publication Order Pass చేసియున్నారు. సదరు 8వ Respondent ది.16-9-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై Court వారి ఎదుట హాజరై ఆక్షేపణలువున్న యడల తెలుపుకొనవలెను. లేనియెడల వారి పరోక్షంన Petition తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా : 16-9-2025

డా॥ డి.వి.రమణారెడ్డి
పి.శ్రీనివాసరావు
అడ్వకేట్స్, విజయవాడ.

దస్తావేజు పోయినవి

నా క్లయింటు పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, సుబ్బారావుపేట ఏరియా వాస్తవ్యులు గద్దే సుబ్బారావు గారి భార్య బేబి నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా నాక్లయింటు మరియు వారి బావగారైన కూచిపూడి వెంకటేశ్వరరావు గారు కలసి ది.24-04-2014 సం॥రం తేదీన కడకట్ల తాలూకు యల్.పి.నం.19/2004 దాఖలా ప్లాటు నం.70 తాలూకు 425 చ.గజముల స్థలమును రిజిస్టరు క్రియ దస్తావేజు నెం.3205/2014గా కొనుగోలు చేసియున్నారు. దరిమిలా నా క్లయింటు గారి బావగారు తన సగం వాటాకు సంబంధించి ది.20-10-2016 సం॥రం తేదీన హక్కు విడుదల దస్తావేజు నెం.8435/ 2016గా నా క్లయింటుకి వ్రాసియున్నారు. నా క్లయింటు ఆస్తికి సంబంధించిన దస్తావేజులు, వాటికి సంబంధించిన లింకు (క్రియ దస్తావేజు) ది.02-11-2004 నం.6648/2004 లు తీసుకుని ది.16-08-2025 సం.రం. తేదీన బ్యాంకు లోను నిమిత్తం న్యాయవాది వద్దకు వెళ్ళి చూసుకొనుసరికి సదరు ఒరిజినల్ దస్తావేజు నం.6648/2004 కనిపించియుండలేదు. ఇప్పటి వరకు వెతికిననూ కనిపించలేదు. కావున ఎవ్వరికైన నా క్లయింటు తాలుకు లింకు దస్తావేజు కనిపించిన, దొరికిననూ అప్పగించవలసిందిగా కోరడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate, Tadepalligudem, W.G.Dt.
తాడేపల్లిగూడెం
తేది.25-08-2025
Cell: 9949076266, 9493480288